సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం। 20। మార్చి। 2023



విత్తన భాండాగారం

నెల్లూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం జిల్లాకే తలమానికంగా ఉంది. ఇక్కడ నూతన వరి వంగడాల సృష్టిపై శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారించారు.

8లో..



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,660
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,507
3 శాతం జీఎస్టీతో	రూ.5,672
నవర (8 గ్రా)	రూ.45,376

గరిష్టం/కనిష్టం
31.7 /22.6

వాతావరణం

ఆదివారం గాలిలో 77 శాతం తేమ ఉంది. సోమవారం అకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మూడో యూనిట్లో విద్యుదుత్పత్తికి బ్రేక్



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టులో మూడో యూనిట్లో విద్యుదుత్పత్తికి విరామం ప్రకటించారు. ఆదివారం ఒకటో యూనిట్లో 435 మెగావాట్లు, రెండో యూనిట్లో 425 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు వెల్లడించారు.

మాస్క్‌లు ధరించాలి

• కలెక్టర్ చక్రధర్‌బాబు



నెల్లూరు(టౌన్): కోవిడ్–19, హెచ్3ఎన్2 ఫ్లూ వైరస్ బారిన పడకుండా ప్రతిఒక్కరూ మాస్క్‌లు ధరించాలి, భౌతిక దూరం పాటించాలని, శానిటైజర్ వినియోగించాలని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో మాట్లాడారు. మూడురోజులపాటు దగ్గు, జ్వరంతో ఇబ్బంది పడుతుంటే సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని ఇంట్లో ఐదురోజులు ఉండాలని చెప్పారు. దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సలహాల కోసం 104, 1077 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉందన్నారు.

బొగ్గు లోడింగ్‌లో అదానీ పోర్టు రికార్డు



పోర్టు నుంచి రైల్లో బొగ్గు రవాణా

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు బొగ్గు లోడింగ్‌లో అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 2014–15 ఆర్థిక సంవత్సరంలో 12.94 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు లోడింగ్ జరిపి బెస్ట్ లోడింగ్‌గా రికార్డు సృష్టించింది. తాజాగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో పాత రికార్డును అధిగమించింది. 12.95 మిలియన్ మెట్రిక్ టన్నుల లోడింగ్ నిర్వహించింది. పోర్టు ప్రయివేట్ సైడింగ్ లిమిటెడ్ నుంచి ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో లోడింగ్ జరగడంపై సంబంధిత వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.40 మిలియన్ టన్నుల వస్తువులను లోడ్ చేయగా, మొత్తం లోడింగ్–ఆదాయంలో కేవలం బొగ్గు వాటా 75 శాతం కలిగి ఉండడం విశేషం. 2009లో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత లోడింగ్, రెవెన్యూలో విజయవాడ డివిజన్ వాటాకు పోర్టు ప్రధాన సహకారిగా కొనసాగుతోందని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

జూన్ 3 నుంచి మహా కుంభాభిషేకం



విజయేంద్ర సరస్వతిని కలిసిన ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో జూన్ 3 నుంచి 7వ తేదీ వరకు మహా కుంభాభిషేక వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో మహా కుంభాభిషేక వేడుకల ముహూర్తాన్ని నిర్ణయించేందుకు రాజమండ్రి సమీపంలోని దేవరపల్లి గ్రామంలో ఉన్న శ్రీ శంకర్ మఠానికి విచ్చేసిన కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి నిర్ణయించి ముహూర్తం ప్రకారంగా జూన్ 3 నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆలయంలో మహాకుంభాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ, అర్చకులు పాల్గొన్నారు.

పిచ్చుకా ఎక్కడికెళ్లావ్!



పిచ్చుక అంటే ఈ తరం పిల్లలకు పెద్దగా తెలియకపోవచ్చు. స్పారో అంటే పుస్తకాల్లో చూసుంటారు కాబట్టి గుర్తుపట్టే అవకాశముంది. 30 సంవత్సరాల వయసు నిండిన వారిని అడిగితే.. చిన్నతనంలో ఆ పక్షిని బాగా చూశామని.. ఆ తర్వాత చాలా తక్కువ సందర్భాల్లో కనిపించిందని చెబుతారు. ఒకప్పుడు ఎక్కడ చూసినా పిచ్చుకలు కనిపించేవి. నేడు మన జీవితం నుంచి అవి దాదాపుగా అంతరించిపోయే దశకు చేరుకున్నాయి.

- 1980 నుంచి తగ్గుదల మొదలు
- ఆవాసాలు, ఆహార కొరతతో విలవిల
- వాటిపై సెల్‌టవర్ల రేడియేషన్ ప్రభావం
- సంరక్షణ చర్యలు చేపట్టకపోతే ఉనికికే ప్రమాదం



సాక్షి, నెల్లూరు డెస్క్: భూమిపై మనుషులతోపాటు యుగాల నుంచి కలిసి మెలసి జీవిస్తున్న చిన్నపాటి పక్షి పిచ్చుక. చెట్లపైనే కాకుండా మానవుడి ఆవాసాల్లోనూ గూళ్లు పెట్టుకుని జీవించే ఈ పక్షి (హౌస్ స్పారో) జాతి నేడు అతి తక్కువ సంఖ్యలో మాత్రమే కనిపిస్తున్నాయి. అడవులు నరికి వేయడం, వ్యవసాయ కమతాలలో చిరుధాన్యాల పంటల సాగు తగ్గిపోవడం, పట్టణాలు, పల్లెల్లో కాంక్రీట్ భవనాల నిర్మాణాలు తదితర కారణాలతో వాటికి ఆవాసం, ఆహారం కొరత ఏర్పడింది. దీంతోపాటు పట్టణాల నుంచి పల్లెల వరకూ ఏర్పాటవుతున్న సెల్‌ఫోన్ టవర్ల నుంచి విడుదలయ్యే ఎలక్ట్రో మ్యాగ్నటిక్ రేడియేషన్ ప్రభావంతో అవి సంతానోత్పత్తిని కోల్పోయి చివరికి అదృశ్యమైపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కోసం 2010 నుంచి ఏటా మార్చి 20వ తేదీన ప్రపంచ పిచ్చుకల దినం నిర్వహిస్తున్నారు.

జీవిత కాలం తక్కువే..

పిచ్చుక జీవిత కాలం మూడు నుంచి నాలుగేళ్లు. అయితే నిత్యం జీవన పోరాటమే. పిల్లులు, పాములు, గద్దలకు చిక్కితే వీటి ప్రాణం పోయినట్లే. బక్కప్రాణి అయిన ఈ పక్షి 16 సెంటీమీటర్ల పొడవు, 30 నుంచి 40 గ్రాముల బరువు ఉంటుంది. సాధారణంగా గంటకు 24 మైళ్ల దూరం ప్రయాణించగలదు. అయితే అత్యవసర సమయాల్లో (ప్రాణ రక్షణకు) మాత్రం 31 కిలోమీటర్ల దూరం వెళ్లగలదని పలు పరిశోధనల్లో వెల్లడైంది. ఆడపిచ్చుక మగదానితో జత కట్టాక గూటిలో 4 నుంచి 5 వరకు గుడ్లు పెడుతుంది. వాటిని 11 నుంచి 14 రోజులు పొదిగిన తర్వాత పిల్లలు వస్తాయి. చిన్నపాటి కీటకాలను చంపి వాటికి ఆహారంగా అందిస్తాయి.

70 నుంచి 80 శాతం క్షీణత

భారతదేశంలో పిచ్చుకలు 1960 నాటితో పోల్చితే దాదాపు 70 నుంచి 80 వరకు తగ్గిపోయాయని బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్) నిర్వహించిన సర్వే ప్రకారం తేలింది. వాతావరణ కాలుష్యం, పంట పొలాలపై విచ్చలవిడిగా క్రిమిసంహారక మందుల వాడకం కూడా అవి అంతరించిపోవడానికి కారణమని పక్షి ప్రేమికులు అంటున్నారు. 1980 దశకం నుంచి వాటి క్షీణత ప్రారంభమైందని బీఎన్‌హెచ్‌ఎస్ పేర్కొంది. మొదట పట్టణ ప్రాంతాల్లో.. ఆ తర్వాత పల్లెల్లో కూడా వాటి మనుగడ కనిపించడం లేదని ప్రస్తావిస్తూ ఇప్పటికైనా తగిన సంరక్షణ చర్యలు తీసుకోకపోతే వాటి ఉనికే అంతర్థానమయ్యే పరిస్థితులు ఉన్నాయని హెచ్చరించింది.

స్పారోమెన్ ఎడ్విన్ జోసెఫ్

బెంగళూరుకు చెందిన ఎడ్విన్ జోసెఫ్ పిచ్చుక జాతి అదృశ్యమవుతుండడంపై కలత చెందారు. వాటిని సంరక్షించాలని తలంచి బెంగళూరులోని విశాలమైన తన ఇంటి ఆవరణ మొత్తాన్ని లిటిల్ బర్డ్స్ శాంక్చువరీగా మార్చేశారు. పిచ్చుకలు ఉండటానికి గూళ్లు ఏర్పాటు చేశారు. నీటి సదుపాయం కల్పించారు. స్వేచ్ఛగా విహరించేలా ఆవరణలో మొక్కలు నాటి చల్లదనం ఉండేలా చేశారు. తృణధాన్యాలు సేకరించి వాటికి ఆహారంగా అందిస్తున్నారు. దీంతో బెంగళూరు ప్రజలు జోసెఫ్‌ను స్పారోమెన్‌గా పిలుస్తున్నారు.

శుభ సూచకంగా..



చైనా దేశంలో ప్రజలు సంతోషాలకు, సంబరాలకు శుభ సూచకంగా పిచ్చుక చిహ్నాన్ని వాడతారు. ఇండోనేషియాలో కూడా పుట్టినరోజు వేడుకలు, పెళ్లి సందర్భాల్లోనూ పిచ్చుక సింబల్‌ను ఉంచుతారు. మన దేశంలోని బిహార్ రాష్ట్ర పక్షిగా పిచ్చుకను గుర్తించింది. భారతదేశంలోని చాలా పల్లెల్లో శతాబ్దాల నుంచి ఇటీవలి కాలం వరకు రైతుల ఇళ్ల ముంగిళ్లలో పిచ్చుకల ఆహారం కోసం ధాన్యపు కంకులను వేలాడదీసేవారు. అవి నాలుగు గింజలను తిని సంతోషంగా ఉంటే పంట దిగుబడి కూడా బాగుంటుందని రైతులు నమ్మేవారంటే అతిశయోక్తి కాదు.

సంరక్షణ చర్యలు తీసుకోవాలి



భారత ఉపఖండంలో గతంలో వేలాది పక్షి జాతులు ఉండేవి. భూమిపై అన్నిరకాల జీవజాతులు ఉంటేనే పర్యావరణ సమతుల్యత ఉంటుంది. చిన్నపాటి కీటకాలను ఆహారంగా తీసుకునే పిచ్చుకలు అంతరించిపోతే కీటకాలు పెరిగి పంట ఉత్పత్తులు తగ్గిపోతాయి. ప్రజల ఆరోగ్యాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది సీరియస్‌గా తీసుకోవాల్సి విషయం. కాబట్టి ప్రభుత్వం వెంటనే వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలి. పక్షుల బ్రీడర్స్‌కు చట్టపరంగా, ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తే పిచ్చుక జాతి అంతరించిపోకుండా కాపాడవచ్చు. – శరణ్, పక్షుల ప్రేమికుడు, నెల్లూరు

కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది



సెల్‌టవర్‌ల నుంచి రేడియేషన్, వాయు కాలుష్యం కారణంగా పిచ్చుకలు కనుమరుగవుతున్నాయి. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పంటలకు వినియోగించే పెస్టిసైడ్స్ వల్ల కూడా పిచ్చుకలు చనిపోతున్నాయి. ప్రధానంగా గతంలో గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లు, దంతెల ఇండ్లు ఉండేవి. వాటిల్లో గూడు కట్టుకుని నివసించేవి. ఇళ్లలో మిగిలిన ఆహార పదార్థాలు, గింజలు, చిన్నచిన్న పురుగులు తిని జీవించేవి. ప్రస్తుతం కాంక్రీట్ భవనాల నేపథ్యంలో పిచ్చుకలు గూడు పెట్టుకునే అవకాశం తగ్గిపోయింది. పిచ్చుకలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. – రవీంద్రనాథ్, జువాలజీ అధ్యాపకుడు, డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల

జోరు వాన



నెల్లూరులో కురుస్తున్న వర్షం

- జిల్లాను వీడని వర్షం
- సరాసరి వర్షపాతం 28.2 మి.మీ
- నీట మునిగిన పంటలు
- నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపిన కలెక్టర్

నెల్లూరు(అర్బన్): ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో జిల్లాలో మూడురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షాలతోపాటు పెద్దఎత్తున గాలులు వీచాయి. దీంతో కలిగిరి మండలంలో సిద్ధనకొండూరు, అనంతపురం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కుమ్మరకొండూరులో ఇంటిపై చెట్టు పడింది. జలదంకి మండలంలోని గట్టుపల్లి రోడ్డు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మామిడి చెట్టు పడిపోయింది. అన్నవరంలో విద్యుత్ స్తంభం పడిపోయింది. నెల్లూరులో శనివారం రాత్రి 33 కేవీ విద్యుత్‌లైన్ తెగిపోవడంతో వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీ తదితర ప్రాంతాలకు సరఫరా నిలిచిపోయింది. అధికారులు వెంటనే స్పందించి తెల్లవారుజాము వరకు కష్టపడి సరఫరాను పునరుద్ధరించారు.

వర్షపాతం ఇలా..

ఆదివారం వరకు జిల్లాలో సరాసరి వర్షపాతం 28.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా బోగోలు మండలంలో 79.8 మి.మీ, అత్యల్పంగా వరికుంటపాడులో 2.4 మి.మీ వాన పడింది. రాపూరులో 74.0, సంగంలో 60.4, కోవూరులో 57.0, నెల్లూరు అర్బన్‌లో 50.0, ఆత్మకూరులో 48.4, కొడవలూరులో 48.2, పొదలకూరులో 46.2, బుచ్చిరెడ్డిపాళెంలో 42.6, విడవలూరులో 41.4, చేజర్లలో 38.0, నెల్లూరు రూరల్‌లో 37.2, కొండాపురంలో 35.0, జలదంకిలో 33.8, వెంకటాచలంలో 30.6, అల్లూరులో 29.6, దగదర్తిలో 28.6, మర్రిపాడులో 27.2, కావలిలో 26.8, కలిగిరిలో 26.8, వింజమూరులో 22.4, మనుబోలులో 20.2, ఇందుకూరుపేటలో 18.4, ఉలవపాడులో 16.6, కలువాయిలో 14.2, అనుమసముద్రంపేటలో 14.2, దుత్తలూరులో 12.8, తోటపల్లిగూడూరులో 12.4, కందుకూరులో 11.4, ఉదయగిరిలో 10.4, సైదాపురంలో 10.2, గుడ్లూరులో 9.8, సీతారామపురంలో 9.2, లింగసముద్రంలో 8.4, ముత్తుకూరులో 8.4, అనంతసాగరంలో 5.4, వలేటివారిపాళెంలో 3.8 మి.మీ వాన కురిసింది. కాగా మరో రెండురోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు ప్రకటించారు.



జలదంకి : అన్నవరంలో నెలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది



బిట్రగుంట: ముంగమూరులో నేలవాలిన వరి పంట

నాలుగువేల హెక్టార్లకు పైగా..

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు అకాల వర్షానికి దెబ్బతినడంతో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు సర్వే చేశారు. ఇప్పటి వరకు ప్రాథమిక పరిశీలనలో 129 గ్రామాల్లో వేలాది హెక్టార్లలో వరితోపాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయని లెక్కలు తేల్చారు. బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు పంట నష్టం వివరాలను నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివారం పంపించారు.

ఆదుకుంటాం

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తాం. ఇది ప్రాథమిక సర్వే మాత్రమే. ఇంకా వర్షాలు కురుస్తున్నాయి. తర్వాత పూర్తిస్థాయిలో సర్వే చేస్తాం. ఎక్కడైనా అదనంగా పంటలు నష్టపోతే వివరాలు సేకరించి బాధిత రైతులను ఆదుకుంటాం. – చక్రధర్‌బాబు, కలెక్టర్

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పంట	దెబ్బతిన్న పంట (హెక్టార్లలో)
ఉదయగిరి	వరి	472.8 (27 గ్రామాల్లో)
	శనగ	600
	పత్తి	160
ఆత్మకూరు	వరి	540.8 (13 గ్రామాల్లో)
	పత్తి	12
	నువ్వులు	22
కావలి	వరి	640 (23 గ్రామాల్లో)
కోవూరు	వరి	430 (17 గ్రామాల్లో)
	వేరుశనగ	20
సర్వేపల్లి	వరి	1,350 (41 గ్రామాల్లో)
	పత్తి	80
నెల్లూరు	వరి	120 (4 గ్రామాలు)
వెంకటగిరి	వరి	44 (4 గ్రామాలు)

(సైదాపురం, కలువాయి, రాపూరు మండలాలు)



సంగం : ర్యాంప్ వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

నేలటూరులో జేడీ పరిశీలన

ఉదయగిరి: అకాల వర్షాలకు ఉదయగిరి ప్రాంతంలో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ జేడీ సుధాకర్‌రాజు పరిశీలించారు. ఆదివారం ఆయన నేలటూరులో నీటమునిగిన వరిపంటను చూసి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలతో ఏఎస్‌పేట, జలదంకి, కలిగిరి, దుత్తలూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో 1,410 ఎకరాల్లో వరి పంటకు నష్టం చేకూరిందన్నారు. అలాగే కలిగిరి మండలంలో 300 ఎకరాల్లో పత్తి పంటకు ఆకులు రాలి దెబ్బతిన్నట్లు చెప్పారు. పంట పొలాల్లో నిల్వ ఉన్న వర్షపునీటిని బయటకు పంపాలన్నారు. తడిసిన వరి ఓదెలపై రెండు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. 33 శాతం పైబడి పంట నష్టం జరిగిన వివరాలు సేకరించి నివేదిక రూపంలో అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వానికి నివేదించి ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, ఏఈఓ సుధీర్‌కుమార్, వీఏఏ స్రవంతి తదితరులున్నారు.



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జేడీ

విద్యా దీవెన నిధులు
రూ.36.53 కోట్ల విడుదల



నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, అధికారులు, విద్యార్థులు

నెల్లూరు(వేదాయపాళెం): జగనన్న విద్యా దీవెన పథకం గతేడాది అక్టోబర్ – డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించిన నిధులను ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఆదివారం జరిగిన సభలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విడుదల చేశారు. జిల్లాలో 48,582 మంది విద్యార్థులకు సంబంధించి రూ.36.53 కోట్లను లబ్ధిదారులైన తల్లుల ఖాతాలో జమ చేశారు. సీఎం సభను జిల్లా సంక్షేమ శాఖ అధికారులు నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తిక్కన ప్రాంగణం నుంచి వీక్షించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య నమూనా చెక్కును ఆవిష్కరించారు. నెల్లూరు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారిణి పరిమళ, నెల్లూరు సాంఘిక సహాయ సంక్షేమాధికారి హజరత్తయ్య, బీసీ సహాయ సంక్షేమాధికారి లక్ష్మీ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు వాసి.. చదువులో దిట్ట

• 'గేట్'లో 135వ ర్యాంకు

ఆత్మకూరు: ఆ తల్లిదండ్రులు బిడ్డల ఉన్నతి కోసం ఎంతో కష్టపడుతున్నారు. చదువుకు సంబంధించి పిల్లలకు కావాల్సిన వాటిని అప్పు చేసి సమకూర్చారు. నేడు పెద్ద కుమారుడు 'గేట్'లో ర్యాంకు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు ఎంతగానో సంతోషిస్తున్నారు.

పట్టణంలోని హిల్ రోడ్డు మేదరివీధికి చెందిన ఒంటేరు లక్ష్మణరెడ్డి, మంజుల దంపతులకు ఇద్దరు కుమారులు. వారికి వ్యవసాయ భూమి లేదు. పాడి పరిశ్రమపై ఆధారపడ్డారు. రెండు గేదెలు కొనుగోలు చేసి పాల వ్యాపారం చేస్తున్నారు. పిల్లల చదువు కోసం భార్యాభర్తలు ఎంతో కష్టపడుతున్నారు. పెద్ద కుమారుడైన ఒంటేరు ప్రభాస్‌రెడ్డి పదో తరగతి వరకు ఆత్మకూరులో, ఇంటర్మీడియట్ నెల్లూరులో చదివాడు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి అనంతపురంలో జేఎన్‌టీయూసీలో బీటెక్ (సీఎస్) సీటు తెచ్చుకున్నాడు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో క్యాంపస్ ఎంపికల్లో హైదరాబాద్‌లోని 'ఫ్యాక్ట్‌సెట్' అనే కంపెనీలో ఉద్యోగం వచ్చింది. సంవత్సరానికి రూ.10 లక్షల ప్యాకేజీ. దీంతో ప్రభాస్ కళాశాల అనుమతితో ఉద్యోగం చేస్తు న్నాడు.



ప్రభాస్‌రెడ్డి

కష్టానికి ఫలితం

రెండురోజుల క్రితం విడుదలైన గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్)–2023 ఫలితాల్లో ప్రభాస్‌రెడ్డికి 135వ ర్యాంక్ వచ్చింది. జేఎన్‌టీయూ కళాశాల అధ్యాపకులు అతడిని అభినందించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. స్థానికులు, బంధువులు, స్నేహితులు ప్రభాస్‌ను అభినందించారు. తాము పడిన కష్టానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు. కాగా వారి రెండో కుమారుడు బీటెక్ రెండో సంవత్సరం కావలిలోని ఓ కళాశాలలో చదువుతున్నాడు.



తల్లిదండ్రులు మంజులమ్మ, లక్ష్మణరెడ్డి

ప్రోత్సహించారు

నా తల్లిదండ్రులు పడుతున్న కష్టం చిన్నప్పటి నుంచి చూస్తున్నా. నేను ఉన్నత స్థాయికి చేరుకుని వారి ఆశలు నెరవేరుస్తా. గేట్‌లో 135వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. అధ్యాపకులు ఎంతో ప్రోత్సహించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నా. త్వరలో బెంగళూరు లేదా ముంబై ఐఐటీలో చేరుతా. – ప్రభాస్‌రెడ్డి

విత్తన భాండాగారం



అన్నం మనం తినే గిన్నెలోకి రావాలంటే ఎందరెందరో ఎంతో కష్టపడి ధాన్యాన్ని పండిస్తారు. రైతన్న మూడు నుంచి నాలుగు నెలలపాటు తాను సాగు చేసిన వరి పంటను కంటికి రెప్పలా కాపాడి ధాన్యాన్ని పండించి మన కడుపునింపుతాడు. అయితే ఈ ధాన్యం పండాలంటే విత్తన సృష్టి ఎంతో కీలకం. అందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రధాన భూమిక పోషిస్తారు. విత్తనం ఉత్పత్తి చేయదానికి నెలలు, సంవత్సరాల తరబడి పరిశోధనలు చేస్తారు. ప్రతి గింజనూ రకరకాలుగా పరీక్షలు చేసి నూతన వరి వంగడాలను రైతులకు అందిస్తారు. అప్పుడే ఆ రకం విత్తనం ప్రాచుర్యంలోకి వస్తుంది. జిల్లాలో అనేక మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ విత్తనాల ఉత్పత్తి కోసం కృషి చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు.



నెల్లూరు ఏరువాక కేంద్రంలో సాగు చేస్తున్న వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు(ఫైల్)

- నూతన వరి వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి
- కొత్త రకం వంగడాల ఉత్పత్తికి 2 నుంచి 3 ఏళ్లకు పైగా సమయం
- విత్తన ఉత్పత్తిలో కీలకంగా పనిచేస్తున్న శాస్త్రవేత్తలు
- ఆచార్య ఎన్‌జీ రంగా పరిశోధనా స్థానం కేంద్రంగా రీసర్చ్

నెల్లూరు(సెంట్రల్): సాగునీరు సమృద్ధిగా ఉండే జిల్లాలో అధిక శాతం మంది రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. జిల్లాలో ప్రతి ఏటా 6 లక్షల నుంచి 7 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. రైతులకు రకరకాల వరి వంగడాలను ఉత్పత్తి చేసి అందించడంలో జిల్లా కేంద్రం నెల్లూరులోని 'ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం' శాస్త్రవేత్తలు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఈ పరిశోధనా స్థానంలో ఇప్పటివరకు పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న అనేక మంది శాస్త్రవేత్తలు కొత్తకొత్త వరి వంగడాల సృష్టికి ఎంతగానో కృషి చేశారు. వరి విత్తనాలపై సంవత్సరాల తరబడి పరిశోధనలు జరిపి నూతన వరి వంగడాలను ఉత్పత్తి చేసి రైతులకు అందించారు.

1948 నుంచి నేటి వరకు..

నెల్లూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా పరిశోధనా స్థానానికి సంబంధించి 1948 సంవత్సరం నుంచి వివిధ వరి వంగడాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. అయితే 1961వ సంవత్సరం నుంచి పరిశోధనల్లో కొంత మార్పులు వచ్చి నూతన వరి వంగడాలు వినియోగంలోకి వచ్చాయి. 1948వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు అనేక మంది శాస్త్రవేత్తలు దాదాపుగా 28 కొత్త వరి వంగడాలను రైతులకు అందించడంలో విశేషంగా కృషి చేశారు. నెల్లూరులో ఉత్పత్తి చేసిన వివిధ రకాల నూతన వరి వంగడాలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రాచుర్యంలో ఉన్నాయి.

నూతన వంగడాల ఉత్పత్తి

జిల్లాలోని వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి బీసీపీ-1, బీసీపీ-2 అనే రెండు రకాల కొత్త వరి వంగడాలను 1948లో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. బీసీపీ-3, బీసీపీ-4 అనే వరి వంగడాలను 1950లో, బీసీపీ-5ని 1951లో, బీసీపీ-6ను 1965లో, బల్క్ హెచ్-9ను 1965లో శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేశారు. తర్వాత కొత్త మొలగొలకులు-72 అనే రకాన్ని 1977లో మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. కొత్త మొలగొలుకులు-74 పేరుతో మరో రకాన్ని 1977లో వినియోగంలోకి తెచ్చారు. అనంతరం పినాకిని ఎన్‌ఎల్ఆర్9672-96ను 1987లో, తిక్కన ఎన్‌ఎల్ఆర్-27999ను 1988లో, సింహపురి ఎన్‌ఎల్ఆర్ 28600, శ్రీరంగ ఎన్‌ఎల్ఆర్-28523, స్వర్ణముఖి ఎన్‌ఎల్ఆర్-145 రకాలను 1991లో ఉత్పత్తి చేశారు. భరణి ఎన్‌ఎల్ఆర్-30491, శ్రావణి ఎన్‌ఎల్ఆర్-33359, స్వాతి ఎన్‌ఎల్ఆర్-33057, పెన్నా ఎన్‌ఎల్ఆర్-33365 రకాల వరి వంగడాలను 1996లో, సోమశిల ఎన్‌ఎల్ఆర్-33358, వేదగిరి ఎన్‌ఎల్ఆర్-33641లను 1999లో, అపూర్వ ఎన్‌ఎల్ఆర్-33654 రకాన్ని 2002లో, పార్థివ ఎన్‌ఎల్ఆర్-33892ను 2006లో, నెల్లూరు మసూరి ఎన్‌ఎల్ఆర్-34449ను 2009లో, శ్వేత ఎన్‌ఎల్ఆర్-40024 రకాన్ని 2012లో, నెల్లూరు ధాన్యరాశి ఎన్‌ఎల్ఆర్-3354, నెల్లూరు సిరి ఎన్‌ఎల్ఆర్-4001, నెల్లూరు సుగంధ ఎన్‌ఎల్ఆర్-40054 రకాలను 2020లో ఉత్పత్తి చేసి రైతులకు అందించారు. ఈ విధంగా 28 రకాల కొత్త వరి వంగడాలను జిల్లా శాస్త్రవేత్తలు అన్నదాతలకు అందించడంలో కీలకపాత్ర పోషించారు.

అధిక ప్రాచుర్యంలో..

శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేసిన నెల్లూరు మసూరి ఎన్‌ఎల్ఆర్-34449, శ్వేత ఎన్‌ఎల్ఆర్-40024, నెల్లూరు ధాన్యరాశి ఎన్‌ఎల్ఆర్-3354, నెల్లూరు సిరి ఎన్‌ఎల్ఆర్-4001, నెల్లూరు సుగంధ ఎన్‌ఎల్ఆర్-40054, స్వర్ణముఖి-145, భరణి-30491, కొత్త మొలగొలుకులు-9674, పార్థివ ఎన్‌ఎల్ఆర్-33892 వరి వంగడాలు ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రైతులు సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఒక్కో వరి వంగడం తయారు కావడానికి దాదాపుగా 2 సంవత్సరాల నుంచి 3 సంవత్సరాల సమయం పడుతుందని, కొన్ని వంగడాల ఉత్పత్తికి ఐదేళ్ల సమయం కూడా పట్టే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొన్ని వంగడాలు పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి రావాలంటే కనీసం 10 సంవత్సరాల సమయం కూడా పడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. శాస్త్రవేత్తలు అన్నిరకాలుగా పరిశోధించి, పరీక్షలు జరిపిన తర్వాతనే ఈ నూతన వరి వంగడాలను రైతులకు అందిస్తుంటారు.

37 మంది శాస్త్రవేత్తల కృషి

జిల్లాకే తలమానికంగా ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రస్తుతం 5 మంది శాస్త్రవేత్తలు విధుల్లో ఉంటారు. విత్తనాల అభివృద్ధి, ఎరువులు ఎన్ని వేయాలి, తెగుళ్లు వస్తే నివారణ, ఏ తెగుళ్లకు ఏఏ పురుగుమందులు వాడాలి.. ఇలా వివిధ రకాలుగా పరీక్షలు చేయడానికి ఆయా విభాగాలకు శాస్త్రవేత్తలు విధుల్లో ఉన్నారు. కాగా పరిశోధనా స్థానం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపుగా 37 మంది శాస్త్రవేత్తలు వివిధ నూతన వరి వంగడాలను కనుక్కోవడంలో ప్రధాన భూమిక పోషించినట్లు తెలుస్తోంది.

నూతన వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి



జిల్లాలోని రైతులకు అవసరాలకు అనుగుణంగా నూతన వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. ఒక వంగడం పూర్తిస్థాయిలో బయటకు రావాలంటే చాలా సమయం పడుతుంది. అప్పటివరకు అన్ని విధాలుగా శాస్త్రవేత్తలు పరిశోధన చేసి నూతన వంగడాలను మార్కెట్‌లోకి తీసుకురావడం జరుగుతుంది. దీని వెనుక సంవత్సరాల తరబడి కష్టం ఉంటుంది.

– వినీత, ప్రధాన శాస్త్రవేత్త, ఎన్‌జీ రంగా పరిశోధనా స్థానం, నెల్లూరు

పరిశోధన చాలా కీలకం.



కొత్త వంగడాల సృష్టి అనేది చాలా కష్టతరమైనది. ప్రధానంగా ఒక రకం వంగడం కనుగొనాలంటే వివిధ దశల్లో, పలు రకాలుగా పరిశోధన చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు కొన్ని ఐదేళ్లు, మరికొన్ని పదేళ్లు, ఒక్కొక్కటి 14 సంవత్సరాల సమయం కూడా పడుతుంది. కానీ వచ్చే ఫలితం ఆధారంగా పరిశోధనా సమయం తీసుకుంటాం. పరిశోధన అనేది చాలా కీలకం.

– శ్రీలక్ష్మి, శాస్త్రవేత్త, ఎన్‌జీ రంగా పరిశోధనా స్థానం, నెల్లూరు

శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తాం



పొలంలో గింజ వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు వరి పంటను కంటికి రెప్పలాగా కాపాడుకుంటాం. సాగులో ఎలాంటి చిన్న సమస్య వచ్చినా తక్షణమే వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆ శాఖ అధికారులను సంప్రదించి వారి సూచనలు, సలహాలు పాటిస్తాం. వరి రకాన్ని బట్టి సాగుకు 3 నుంచి 4 నెలల సమయం పడుతుంది.

– సుబ్బానాయుడు, అప్పారావుపాళెం, ఆత్మకూరు మండలం

తెలుగు సంస్కృతిని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్: తెలుగు సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి పాల్గొని మాట్లాడారు. మాతృభాష ఎంతో ఉన్నతమైందని, ఉగాది పండగకు ఎంతో విశిష్టత ఉందని తెలిపారు. తెలుగుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఇతర భాషలపై కూడా అవగాహన ఉండాలని తెలిపారు. ఉగాది పంచాంగ శ్రవణం, కవిసమ్మేళనంలో వివిధ కవుల వేషధారణలో ప్రముఖ కవులు అలరించారు. తెలుగు సంప్రదాయ నృత్యాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరదత్, టీటీడీ న్యూఢిల్లీ ఆలయాల చైర్‌పర్సన్ ప్రశాంతిరెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు, పలువురు కవులు, మేధావులు, పండితులు పాల్గొన్నారు.



నృత్యప్రదర్శన ఇస్తున్న కళాకారులు

క్లుప్తంగా

నేటి నుంచి 'ఇంటర్' మూల్యాంకనం

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి నెల్లూరులోని కేఏసీ జూనియర్ కాలేజీలో ప్రారంభమవుతుందని ఆర్ఐఓ వరప్రసాద్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సంస్కృతం పేపర్‌ను మూల్యాంకనం చేస్తారన్నారు. ఇంటర్ బోర్డు అధికారులు పంపిన ఉత్తర్వుల మేరకు ప్రతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తమ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులను ఈ కార్యక్రమానికి పంపాలన్నారు. మొదటి విడత మూల్యాంకనం వచ్చే నెల ఒకటో తేదీ వరకు, రెండో విడత మూడో తేదీ వరకు, మూడో విడత ఐదో తేదీ వరకు, నాలుగో విడత ఎనిమిదో తేదీ వరకు జరుగుతుందన్నారు.

108లో ఈఎంటీ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అరబిందో ఎమెర్జెన్సీ 108 వాహనాల్లో ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని 108, 104 వాహనాల జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ గ్రాడ్యుయేషన్(జీఎన్ఎం, బీఎస్సీ), బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, అనస్తీషియా టెక్నీషియన్, 5 సంవత్సరాల అనుభవంతో కూడిన క్యాత్‌ల్యాబ్, డిప్లొమో ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ తదితర అర్హతలు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోపు పెద్దాస్పత్రి ఆవరణలో ఉన్న దిశ పోలీసుస్టేషన్ పక్కన గల 108 జిల్లా కార్యాలయంలో తమ జిరాక్స్ సర్టిఫికెట్‌లతో దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. వివరాలకు 83284 61648 అను నంబర్లో సంప్రదించాలని కోరారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి: రూ.75
సన్నవి: రూ.60
పండ్లు: రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	95
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	172
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	192
లేయర్ చికెన్ :	128

కావలిలో భారీగా బియ్యం స్వాధీనం

- పాతూరులోని రైస్‌మిల్లులో అధికారుల దాడులు
- రూ.42 లక్షల విలువైన బియ్యం, లారీ సీజ్

కావలి: పట్టణంలోని పాతూరులో ఉన్న శేషాద్రి రైస్‌మిల్లులో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు ఆదివారం రాత్రి మెరుపుదాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో దాడులు చేయగా అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ.42 లక్షల విలువైన బియ్యంతోపాటు బియ్యం బస్తాలతో సిద్ధంగా ఉన్న రూ.10 లక్షలు విలువైన లారీని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల కథనం మేరకు జాయింట్ కలెక్టర్‌కు పాతూరులోని శేషాద్రి రైస్‌మిల్లులో బియ్యం అక్రమ నిల్వలు ఉన్నాయనే సమాచారం అందడంతో పౌరసరఫరాలశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. జేసీ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు కావలికి చేరుకుని స్థానిక అధికారులతో కలిసి మిల్లులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లు ఆవరణలోని లారీలో 676 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా విడిగా మరో 400 బస్తాల బియ్యంతోపాటు సుమారు 300 బస్తాలు ఉండే బియ్యం రాసులను కూడా గుర్తించారు. బియ్యానికి సంబంధించి సరైన రికార్డులు లేకపోవడంతో మొత్తం రూ.42లక్షల విలువైన బియ్యం, రూ.10 లక్షలు విలువైన లారీని సీజ్ చేశారు. రైస్‌మిల్లులో పట్టుబడిన బియ్యం రేషన్ బియ్యంగా అనుమానిస్తున్నారు. ఈ మేరకు బియ్యం నమూనాలను ల్యాబ్‌కు తరలించి మిల్లు యజమానిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు.

టిప్పర్ డ్రైవర్ హల్‌చల్

- తప్పించుకునేందుకు కాలువలో దూకి ఈతకొట్టి..
- చివరకు పోలీసులకు చిక్కిన వైనం

పొదలకూరు: డ్రైవర్ నిర్లక్ష్యంగా టిప్పర్‌ను నడిపి యువకుడిని గాయపరిచి, అడ్డువచ్చిన గేదెను ఢీకొట్టాడు. అంతటితో ఆగక సంగం వారధి కట్ట అంచు వద్ద ప్రమాదకరస్థితిలో టిప్పర్‌ను నిలిపి కాలువలో దూకాడు. తప్పించుకునే ప్రయత్నంలో చివరికి పోలీసులకు చిక్కాడు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కథనం మేరకు ఆదివారం పొదలకూరు మీదుగా వింజమూరుకు వెళ్లేందుకు వెంకటాచలం మండలం ఇడిమేపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ సీహెచ్ కృష్ణ ఖాళీ టిప్పర్‌ను తోలుకుని వెళుతున్నాడు. పొదలకూరుకు సమీపంలోని సంగం మార్గం అయ్యగారిపాళెం రోడ్డు వద్ద ప్రభగిరిపట్నం గ్రామానికి చెందిన యువకులు బైక్‌పై వస్తుండగా వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పిల్లాపాక వెంకటేశ్వర్లు తలకు గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు సోదరులు డ్రైవర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించడంతో అతను వేగంగా టిప్పర్‌ను నడుపుకుంటూ వెళ్లి అదే మార్గంలో తాటిపర్తి వద్ద గేదెను ఢీకొట్టాడు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై తన సిబ్బందితో అక్కడికి వెళ్లగా డ్రైవర్ కృష్ణ అక్కడి నుంచి సంగం వారధి వరకు అతివేగంగా వెళ్లి కట్టపై టిప్పర్‌ను ప్రమాదకరస్థితిలో నిలిపి కాలువలోకి దూకాడు. కాలువలో ఈదుతూ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. డ్రైవర్‌ను పట్టుకోవాలని అక్కడే ఉన్న ఈతగాళ్లకు పోలీసులు తెలపడంతో వారు కాలువలో దూకి అతనిని పట్టుకున్నారు. నిందితుడు కృష్ణను పొదలకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయపడిన వెంకటేశ్వర్లును స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు. క్షతగాత్రుడి సోదరుడు శివ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై ఎస్సై కేసు నమోదు చేశారు.



టిప్పర్ డ్రైవర్ ఢీకొట్టిన బైక్‌ను పరిశీలిస్తున్న ఎస్సై కరిముల్లా

నేడు యథావిధిగా 'పోలీసు స్పందన'

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం 'పోలీసు స్పందన' కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఆ కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని నిర్వహించలేదని, కోడ్ ముగియడంతో యథావిధిగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యాన్, లారీ ఢీకొని ఇద్దరు మృతి

- తమిళనాడులోని పెరంబలూరు జిల్లాలో ఘటన

సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్రం పెరంబలూరు జిల్లా మానామధురై జాతీయ రహదారిలో చేపల లోడుతో వెళ్తున్న వ్యాన్, లారీ ఢీకొన్న ప్రమాదంలో నెల్లూరులోని కొండాయపాళేనికి చెందిన ఇద్దరు మృతిచెందారు. వివరాలు.. తంజావూరు నుంచి అరియలూరు వైపుగా శనివారం అర్ధరాత్రి వెళ్తున్న ఓ కంటైనర్, తంజావూరు వైపుగా వెళ్తున్న ఓ మినీ సరుకుల వ్యాన్ తిరుమానూరు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మినీ సరుకుల వ్యాన్ రోడ్డు పక్కన ఉన్న కొలనులో పడింది. గాయపడిన డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతిచెందాడు. వ్యాన్ కొలనులోకి దూసుకెళ్లడంతో అందులోని మరొక వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. వారి గుర్తింపు కార్డుల్లోని వివరాల ఆధారంగా మృతులు నెల్లూరులోని కొండాయపాళేనికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు రాజా, సత్యనారాయణ కుమారుడు రమేష్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు ఈ సమాచారాన్ని నెల్లూరులోని వ్యాన్ యజమానికి చేరవేశారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సురేష్, మరో వ్యక్తి మహ్మద్ ఇబ్రహీం గాయపడ్డారు.

లారీ చక్రాల కింద నలిగి..

- యువకుడి దుర్మరణం

వెంకటాచలం: లారీ చక్రాల కింద నలిగి ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఫరియద్‌ఖాన్(33) నెల్లూరు నగరంలో ఉంటూ ఐస్ బండి ద్వారా ఊరూరా తిరుగుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బురాన్‌పూర్ వద్ద ఐస్ బండితో రోడ్డు క్రాస్ చేసే క్రమంలో ఓ లారీ, ఐస్ బండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఫరియద్‌ఖాన్ లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫరియద్‌ఖాన్ మృతదేహం